క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఆత్మకూరు : ఎస్సైగా జక్కుల పరమేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సీఐ సంతోశ్, సిబ్బంది అభినందించారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



శాయంపేట : మండలంలోని 24 గ్రామాల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై బుధవారం తనిఖీ బృందం మొదటి విడతలో ఐదు గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. కాట్రపల్లి, గోవిందాపూర్, తహారాపూర్, వసంతపూర్, మైలారం గ్రామాల్లో విచారణ చేపట్టి రికార్డులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జరిగిన గ్రామసభల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన పొరపాట్లను వెల్లడించారు. బాధ్యుల నుంచి వివరణ తీసుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామానికి చెందిన గాదె ప్రభాకర్ రెడ్డికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కును మాజీ ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి బుధవారం అందించారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం పొందాడు. ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతూ సీఎం సహాయనిధికి దరఖాస్తులు చేసుకున్నాడు. ఈ మేరకు రూ.30 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుగా ఆయన అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, సతీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాలకు నో ఎంట్రీ



నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ వాగు వద్ద రోడ్డు డైవర్షన్‌లో భాగంగా తాత్కాలికంగా వంతెన పునరుద్ధరింపు పనులు చేపట్టారు. కానీ పూర్తి స్థాయిలో క్యూరింగ్ కాకపోవడంతో మరో రెండురోజులు భారీ వాహనాలు రాకపోకలు సాగించొద్దని సంబంధించిన కాంట్రాక్టర్ ఈ సందర్భంగా కోరారు.

పలకల పంపిణీ



శాయంపేట : మండలంలోని కొత్తగట్టుసింగారం గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు అదే గ్రామానికి చెందిన పెంబర్తి వినయ్–స్వర్ణ దంపతులు పలకలు బహూకరించారు. వారి కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వారు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాకాజీ కాలనీ, హనుమకొండ చౌరస్తా, జిల్లా బస్‌స్టేషన్, అలంకార్ జంక్షన్, గాంధీనగర్, టైలర్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, వడ్డెపల్లి పోస్టాఫీస్ ప్రాంతం, విజయ్‌పాల్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హ్యూమానిటీస్ భవనంలో బుధవారం నిర్వహించిన పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ సమావేశంలో అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సోల్తి కిరణ్‌గౌడ్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా డాక్టర్ సుభాష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ విజయ్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ కేపీఎస్ నరేందర్, అడ్వైజర్లుగా డాక్టర్ సుమంత్, డాక్టర్ మోహన్, కోఆర్డినేటర్‌గా రాజేంద్రప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

మూడేళ్లు గడుస్తున్నా మోక్షం లేదు..



ఉప్పల్–దేశరాజుపల్లి మార్గంలో కొట్టుకుపోయిన కంకర, మట్టి, ప్రమాదకరంగా మారిన రోడ్డు



కమలాపూర్–కన్నూరు మార్గంలో ఇలా..

- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులేవి?
- గతంలో కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్లు
- కోతకు గురైన సైడ్‌బర్మ్‌లు
- మరమ్మతులు చేయాలని ప్రయాణికుల వేడుకోలు
- పట్టించుకోని అధికారులు

కమలాపూర్ : 'ఏరోజు సమస్య ఆరోజు.. గతం గతఃహ, గతంతో ఏర్పడిన సమస్యకు ఇప్పుడు పరిష్కారించడం కష్టమే' అన్నట్లుగా ఉంది పాలకులు, అధికారుల తీరు. మూడేళ్ల క్రితం కురిసిన భారీ నుంచి అతి భారీ వర్షాలకు మండలంలోని వివిధ చోట్ల రోడ్లు దెబ్బతినగా మరికొన్ని చోట్ల కొట్టుకుపోయాయి. వాటికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టి చేతులు దులుపుకున్న అధికారులూ.. ఇప్పటి వరకు ఆ రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపలేదు. దీంతో ఆయా మార్గాల్లో ప్రయాణిస్తున్న వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. మరిన్ని ప్రమాదాలు జరుగకముందే దెబ్బతిన్న, కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

కొట్టుకుపోయిన కల్వర్టు, రోడ్డు

సుమారు మూడేళ్ల క్రితం కురిసిన అతి భారీ వర్షానికి కమలాపూర్ నుంచి తాటి వనం మీదుగా కన్నూరుకు వెళ్లే మార్గంలో గల కన్నూరు శివారులోని బ్రిడ్జి కిరువైపులా ఉన్న రోడ్డు కోతకు గురై కొంత మేర కొట్టుకుపోయింది. మరికొంత మేర రోడ్డుకు ఒక పక్కన సైడ్‌బర్మ్ కోతకు గురయ్యింది. అదే విధంగా ఉప్పల్–దేశరాజుపల్లి మార్గంలో దేశరాజుపల్లికి వెళ్లే రోడ్డు, ఓ కల్వర్టు కొట్టుకుపోగా.. కల్వర్టుకు ఇరువైపులా ఉన్న రోడ్డుకు, సైడ్‌బర్మ్‌లు కోతకు గురై ప్రమాదకరంగా మారాయి. ఉప్పల్–దేశరాజుపల్లి మార్గంలో ఇటీవల ఓ ఆటో కొట్టుకుపోయి, కోతకు గురైన కల్వర్టు వద్ద ఉన్న గుంతలో పడిపోయింది. గతంలోనూ పలువురు వాహనదారులు కొట్టుకుపోయి కల్వర్టు గుంతల్లో, రోడ్డు సైడ్‌బర్మ్‌లో పడిపోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు.

పట్టించుకోని అధికారులు

భారీ వర్షాల కారణంగా కొట్టుకుపోయిన, కోతకు గురైన రోడ్లకు అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. కానీ అక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నా శాశ్వత మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలిక మరమ్మతులైతే చేశామని, ఆ తర్వాత ఏం జరిగినా తమకేమీ సంబంధం లేదన్నట్లు అధికారుల తీరు ఉందని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూడేళ్లు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా ఇటువైపు ప్రయాణిస్తున్న ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎదురుగా వాహనం వస్తే అంతే..



దేశరాజుపల్లి నుంచి ఉప్పల్‌కు వెళ్లే మార్గంలో ఉన్న కల్వర్టు గతంలో కురిసిన వర్షానికి కోతకు గురైంది. ఆ కల్వర్టుకిరువైపుల ఉన్న రోడ్డు సైతం ఓ పక్కన కోతకు గురైంది. పైకి చూస్తే తారు కనిపిస్తుంది కానీ కింద ఉన్న మట్టి, కంకర అంతా కొట్టుకుపోయింది. ఎదురుగా వాహనం వస్తే పక్కకు జరగాలంటే ఎక్కడ పడిపోతామోనని భయమేస్తుంది.

– ఎల్లబోయిన సదయ్య, దేశరాజుపల్లి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న, కొట్టుకుపోయిన రోడ్ల మరమ్మతుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం. అవసరమైతే అందుబాటులో ఉన్న నిధులను వినియోగించి వీలైనంత త్వరగా మరమ్మతులు చేయించి ప్రమాదాలు అరికట్టే ప్రయత్నం చేస్తాం.

–గుండె బాబు, ఎంపీడీఓ

వైఎస్సార్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ఆత్మకూరు : మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు దివంగత మహానేత వైఎస్సార్ స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగయ్యపల్లిలో బుధవారం ఆయన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌కు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి పేదలకు అండగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చి ధనిక తెలంగాణను అప్పుల తెలంగాణగా మార్చిందని విమర్శించారు. లిక్కర్ స్కాంలో 5నెలలు జైలులో ఉండి విడుదలైన కవిత బెయిల్‌పై బయటకు వస్తే బీఆర్ఎస్ నాయకులు సంబురాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బెయిల్ రాగానే నిజాయితీపరురాలు కాదని, వాస్తవాలు ప్రజలకు తెలుసన్నారు. రైతు రుణమాఫీపై బీఆర్ఎస్ ఆరోపణలను కాంగ్రెస్ కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, శ్రీధర్, రాజు, కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏసీపీ విజయ్ కుమార్

ధర్మసాగర్ : విద్యార్థులు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ ఏసీపీ విజయ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సైబర్ సెక్యూరిటీపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళి అధ్యక్షతన బుధవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థులు డిజిటల్ యుగంలో ఉన్నారని, ఆన్‌లైన్‌లో ఎక్కువ సమయం గడపడంతో సైబర్ మోసాలు ,బెదిరింపులకు గురవుతున్నారని అన్నారు. విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, విశ్రాంత అటవీశాఖ అధికారి పురుషోత్తం పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంచేందుకు పర్యావరణ పరిరక్షణ విషయాలను వివరించి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



ఆత్మకూరు : బోనాలతో వస్తున్న మహిళలు



దామెర : బోనాలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు



వేలేరు : బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ఆత్మకూరు : మండల కేంద్రంలో బుధవారం పోచమ్మ బోనాలను వైభవంగా జరుపుకొన్నారు. డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలు ఎత్తుకొని శోభాయాత్ర నిర్వహించి పోచమ్మతల్లికి మొక్కులు చెల్లించుకున్నారు.

వేలేరులో..

వేలేరు : శ్రావణమాసం సందర్భంగా మండలంలోని పీచర గ్రామంలో పోచమ్మ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటి నుంచి బోనాన్ని ఎత్తుకుని డప్పుచప్పుళ్ల నడుమ ఆలయానికి బయలుదేరారు. బెల్లంతో తయారు చేసిన బోనాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు.

దామెరలో..

దామెర : మండలంలోని పులుకుర్తిలో బోనాల సందడి నెలకొంది. శ్రావణమాసం చివరి బుధవారం కావడంతో గ్రామంలో పోచమ్మ బోనాలను ఘనంగా జరుపుకొన్నారు. పోచమ్మ తల్లికి ప్రీతిప్రాయమైన బోనాన్ని నియమనిష్టలతో తయారుచేసి ఆలయానికి బయలుదేరారు. పిల్లాపాపలతో కుటుంబ సభ్యులంతా కలిసి డప్పుచప్పుళ్ల నడుమ శివసత్తుల పూనకాలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం బోనం, పసుపు, కుంకుమ, చీరె, సారె, ధూప దీప నైవేద్యం సమర్పించారు. మాజీ సర్పంచ్‌లు అశోక్, వెంకటేశ్వర్లు, సత్యం, ఉపసర్పంచ్ రాజు, ఎంపీటీసీ సభ్యులు సుమలత, సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

ఎల్కతుర్తి : గడ్డిమందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన భీమదేవపల్లి మండలం మల్లారం గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారం గ్రామానికి చెందిన నాగిళ్ల యాదగిరి (50) కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. సమస్య మరింత తీవ్రతరం కావడంతో నొప్పి భరించలేక ఈనెల 12వ తేదీన వ్యవసాయ బావి వద్ద గడ్డిమందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులకు తెలుపడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న యాదగిరి.. పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : రోడ్డుప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని కొత్తగట్టు సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ నగరంలోని మండిబజార్‌కు చెందిన ఎస్.డి.గఫూర్ (38) ఈనెల 26 వ తేదీన టైల్స్ వర్క్స్ పని నిమిత్తం మరో వర్కర్ బత్తుల లక్ష్మణ్‌తో కలిసి బైక్‌పై పరకాలకు వెళ్లి తిరుగు ప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో మండలంలోని కొత్తగట్టు సమీపంలో గుంతల రోడ్డుపై బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డారు. దీంతో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు 108లో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా గఫూర్ మంగళవారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య నాజియాసుల్తానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోశ్ తెలిపారు.

వ్యవసాయశాఖ అధికారులకు సహకరించాలి



కమలాపూర్ : రుణమాఫీ కాని రైతుల వివరాలు పోర్టల్‌లో నమోదు చేస్తున్న అధికారులు



వేలేరు : రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ లలిత

కమలాపూర్ : రుణమాఫీ కాని రైతులను గుర్తించేందుకు సర్వే చేపట్టిన వ్యవసాయశాఖ అధికారులకు రైతులు సహకరించాలని ఏఓ లక్ష్మారెడ్డి కోరారు. మండలంలో రుణమాఫీ కాని రైతులను గుర్తించేందుకు అధికారులు సర్వే చేపట్టినట్లు తెలిపారు. బుధవారం గూనిపర్తి, మాదన్నపేట గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల నుంచి వివరాలు సేకరించి పోర్టల్‌లో పొందుపర్చామన్నారు. తొలిరోజు రుణమాఫీ కాని 25 మంది రైతులకు సంబంధించిన వివరాలు రుణమాఫీ పోర్టల్‌లో నమోదు చేసినట్లు వ్యవసాయ శాఖ అధికారి జాలి లక్ష్మారెడ్డి వెల్లడించారు. అలాగే ఉప్పల్‌లో గురువారం సర్వే చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రుణమాఫీ కాని రైతులు తమ కుటుంబ సభ్యుల వివరాలు, ధ్రువీకరణ పత్రాలతో పాటు కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను వ్యవసాయ శాఖ అధికారులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శనిగరం ఏఈఓ ఎం.ప్రతాప్, రైతులు పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : అర్హత కలిగి రూ.2లక్షల రుణమాఫీకాని రైతుల వివరాలను సేకరించాలని ఏఓ లలిత ఏఈఓలకు సూచించారు. మండలంలోని కమ్మరిపేట గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో బుధవారం ఏఈఓ రాజశేఖర్‌తో కలిసి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లేకపోవడం, బ్యాంకుల్లో పేర్లు తప్పుగా నమోదు అయ్యి ఉండడం, ఆధార్ కార్డులో తప్పుగా ఉన్నా యాప్‌లో నమోదు చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఈ-యాప్స్ వినియోగంతో రైతులకు మేలు



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కమలాపూర్ : దళారి వ్యవస్థను నిర్మూలించి పంట మద్దతు ధరను తెలుసుకునేందుకు రైతులు ఈ–యాప్స్‌ను వినియోగించాలని ఎస్ఆర్ విశ్వవిద్యాలయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు సూచించారు. గ్రామీణ అవగాహన కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా కళాశాల డీన్ డాక్టర్ భూపాల్‌రాజ్, కో ఆర్డినేటర్ శ్రీకర్‌రెడ్డి, గ్రామ కో ఆర్డినేటర్ సాయికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులపై బుధవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, మార్కెటింగ్ యాప్స్ ఈ–నామ్, అగ్రి సెంట్రల్, ఈ–కిసాన్, నాగలి, కిసాన్ సువిధ పనితీరును వివరించి రైతులకు అవగాహన కల్పించారు. దళారి వ్యవస్థను నిర్మూలించడం, రోజువారి పంట ధరలను తెలుసుకోవడంలో ఈ యాప్స్ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు రవి, రుశ్విత్, వరుణ్ యాదవ్, నూతన ఆర్య, లోకేష్ నాయక్, స్మిత, సనా అఫ్రీన్, పూజిత, సాహితి, హారిక, అభినయ, రైతులు రాజు, సాగర్, మల్లయ్య, శ్రీనివాస్, రాజయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి

- ఖాళీ ప్లేట్లతో ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన



ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న నాయకులు

పరకాల : ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియేట్ చదువుకుంటున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పరకాల ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు బొచ్చు ఈశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద విద్యార్థులపై అభిమానం ఉంటే తక్షణమే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని అన్నారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా వ్యవస్థను పట్టించుకోవాల్సిన అవసరం ఉండేదని అన్నారు. ప్రభుత్వ విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. నిరుపేద విద్యార్థులు చదువుకునేందుకు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి శ్రీకారం చుట్టిన ఫీజు రియాంబర్స్‌మెంట్‌ను కొనసాగించాలని, బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఉన్నా ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాటం చేస్తోందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి సాయితేజ, నాయకులు తరుణ్, వినయ్, అజయ్‌వర్మ, విష్ణుతేజ పాల్గొన్నారు.

రైతు భరోసా ఆప్‌లో వివరాల నమోదు



దామెర : రుణమాఫీ పొందిన రైతు కుటుంబ సభ్యుల వివరాలను రైతు భరోసా యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని మండల వ్యసాయ అధికారి అల్లె రాకేశ్ సూచించారు. మండలంలోని ఊరుగొండలో వ్యవసాయ అధికారులు బుధవారం రుణమాఫీ పొందిన రైతుల వద్దకు వెళ్లి వారి వివరాలను రైతు భరోసా యాప్‌లో నమోదు చేశారు. ఏఓ మాట్లాడుతూ.. రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా రైతుల వద్దకు వెళ్లి వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ధ్రువీకరణప్రతం, ఆధార్ కార్డులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారులకు సహకరించాలని కోరారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా పారదర్శకంగా రైతుల వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత



పాఠశాలను సందర్శిస్తున్న రవి కుటుంబ సభ్యులు

వేలేరు : పేద విద్యార్థుల ఉన్నతచదువులకు ఆర్థికంగా అండగా ఉంటామని ఎన్ఆర్ఐ గౌరిశెట్టి వెంకట నాగరాజు అన్నారు. వేలేరు ప్రభుత్వ పాఠశాలకు చెందిన పల్లా సాహితి, పల్లా సాహిత్యలు 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విషయం తెలిసిందే. కాగా ఇరువురు విద్యార్థులకు రూ.50 వేల ఆర్థికసాయం అందించారు. పాఠశాల హెచ్ఎం రాజన్న ఆధ్వర్యంలో విద్యార్థుల తండ్రి పల్లా రవి బ్యాంక్ ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేశారు. పేద విద్యార్థులకు తమవంతుగా సాయం అందించినట్లు తెలిపారు. తన తండ్రి ఇదే పాఠశాలలో గెజిటెడ్ హెచ్ఎంగా విధులు నిర్వహించారని, తాను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నానని గుర్తు చేశారు. కాగా అమెరికా నుంచి ఇటివల వచ్చిన వెంకటనాగరాజు కుటుంబ సమేతంగా పాఠశాలకు వచ్చి తాను చదువుకున్న తరగతి గదిని, చిన్ననాటి జ్ఞాపకాలను భార్య పిల్లలకు చూపిస్తూ గుర్తుచేసుకున్నాడు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కమల్‌కిశోర్‌ను కలిసిన నాయకులు

నడికూడ : రజక సంఘం జాతీయ నాయకుడు, ఏఐసీసీ సెక్రటరీ కమల్‌కిశోర్ కమోండోను హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ దురిశెట్టి చందు బుధవారం మర్యాదపూర్వంగా కలిశారు. ఉద్యోగుల సంఘం కన్వీనర్ జయరామ్, బాబు కలిసిన వారిలో ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

మండల కేంద్రంలోని ఎస్‌బీఐ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. వర్షాకాలంలో ఇనుప కంచెకు విద్యుత్ సరఫరా అయ్యే ప్రమాదం ఉంది. ఇనుప కంచెకు పశువులు, బాటసారులు తగిలితే మృత్యువాతపడే ప్రమాదం ఉంది. ఈక్రమంలో అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

– శాయంపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
రాజ్‌కుమార్, ఏఈ, విద్యుత్ శాఖ
ఫోన్‌నంబర్ : 94408 14862

బాబాసాహెబ్ ఆప్టే స్మారక దివస్

హన్మకొండ కల్చరల్: వరంగల్ చాప్టర్ ఇతిహాస సంకలనం సమితి (భారతీయ) ఆధ్వర్యంలో హనుమకొండలోని రాజరాజ నరేంద్రాంధ్ర భాషా నిలయంలో బాబా సాహెబ్ ఆప్టే సమర్పన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు.